సాక్షి మెదక్

శుక్రవారం ၊ 7 ၊ జూన్ ၊ 2024



నల్ల రేగడిలో పత్తి జోరు

నల్ల రేగడి భూముల్లో పత్తి విత్తన ప్రక్రియ జోరందుకుంది. భారీ వర్షం కురవకపోయినా బెట్టను తట్టుకునే అవకాశం ఉంది.

వివరాలు 8లో ▸



వేసవి దుక్కులతో మేలు

వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు ముందుగా వేసవి దుక్కులను సిద్ధం చేస్తున్నారు.

వివరాలు 8లో ▸



మా కళాశాలలో చేరండి

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు అధ్యాపకులు గ్రామాల బాటపట్టారు.

వివరాలు 9లో ▸

రేపు జిల్లా వ్యవసాయ అధికారితో ఫోన్ ఇన్

మెదక్‌జోన్: వానాకాలం సాగుపై 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం ఫోన్ ఇన్ నిర్వహించనుంది. సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగులో పాటించాల్సిన మెలకువలు, విత్తనాలు, సేంద్రియ, రసాయన ఎరువుల వాడకంపై జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌కు నేరుగా ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.





తేదీ : 08-06-2024

సమయం : ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :

72888 94450

న్యూస్‌రీల్

గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: గ్రూప్–1 ప్రిలిమినరీ రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. గురువారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బయోమెట్రిక్‌పై అవగాహన కల్పించారు. ఈనెల 9వ తేదీన నిర్వహించే ప్రిలిమినరీ రాత పరీక్ష బయోమెట్రిక్ సిస్టంతో ఉంటుందన్నారు. అభ్యర్థుల నుంచి వేలిముద్రలు తీసుకుంటామని తెలిపారు. పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తుతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, డీసీఆర్‌బీ సీఐ రవీందర్, ఎస్‌బీ సీఐ సందీప్‌రెడ్డి, చీఫ్ సూపరింటెండెట్లు, అబ్జర్వర్లు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు తదితరులు పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీరాం

మనోహరాబాద్(తూప్రాన్): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ శ్రీరాం అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం మండల పరిధిలోని వైద్యులు, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ నవీన్ కుమార్, తూప్రాన్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ అమర్‌సింగ్, పీహెచ్‌సీ డీడీఓ వికాస్, సీహెచ్‌ఓ బాల్‌నర్సయ్య, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

కేతకీలో అమావాస్య సందడి



క్యూలో వేచి ఉన్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయం సందడిగా మారింది. గురువారం అమావాస్యను పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమృత గుండంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి జలలింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకం, అర్చన, కంట్లం, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

లోపమెక్కడ..





- ఓటమి కారణాలపై కాంగ్రెస్ ఆరా
- మెదక్ అసెంబ్లీ సెగ్మెంట్ ఫలితాలపై అధిష్టానం విస్మయం
- పార్టీకి భారీగా తగ్గిన ఓటింగ్ శాతం
- నివేదికలు తెప్పించుకున్న రాష్ట్ర నాయకత్వం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : మెదక్ లోక్‌సభ స్థానంలో తమ ఓటమికి గల కారణాలను కాంగ్రెస్ పార్టీ సమీక్షించుకుంటోంది. ఇక్కడ గెలుపుపై ముందు నుంచి ధీమాతో ఉన్న ఆ పార్టీకి ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆశించిన మేర ఓట్లు ఎందుకు పడలేదనే అంశంపై ఆరా తీస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో జహీరాబాద్‌ను తన ఖాతాలో వేసుకున్న కాంగ్రెస్.. మెదక్‌లో మాత్రం రెండో స్థానానికి పరిమితమైంది. ఇక్కడ 39,139 ఓట్ల మెజారిటీతో బీజేపీ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు విజయం సాధించగా, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ఓటమి పాలయ్యారు.

మెదక్‌లో తారుమారైన లెక్కలు

మెదక్ లోక్‌సభ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీకి ఏకైక సిట్టింగ్ అసెంబ్లీ స్థానం మెదక్. ఈ సెగ్మెంట్‌లో ఆ పార్టీకి మెజారిటీ రావాల్సింది పోయి రెండో స్థానానికి పరిమితమైంది. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 87,236 ఓట్లు సాధించిన కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికల్లో 55,588 ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే 31,538 ఓట్లు తగ్గాయి. ఓట్లు భారీగా తగ్గడానికి అక్కడి నాయకత్వ లోపమే కారణమనే అభిప్రాయం హస్తం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లో అసెంబ్లీ ఎన్నికల కంటే ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్ల సంఖ్య భారీగా పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్‌కు 32,568 ఓట్లు రాగా, ఈ ఎన్నికల్లో 65,539 ఓట్లు వచ్చాయి. అంటే సుమారు 32,971 ఓట్లు పెరిగాయి. అంటే గజ్వేల్‌లో కాంగ్రెస్‌కు ఓటింగ్ సంఖ్య భారీగా పెరగడం, మెదక్‌లో తగ్గడంపై హస్తం శ్రేణులను విస్మయానికి గురిచేస్తోంది. ఇక్కడ ఎమ్మెల్యే రోహిత్ పూర్తి స్థాయిలో ఎఫర్ట్ పెట్టలేదా..? క్యాడర్ పట్టించుకోలేదా? మరేదైనా కారణమా? అనే అంశంపై చర్చ జరుగుతోంది.

పటాన్‌చెరులోనూ అంతంతే..

పటాన్‌చెరు అసెంబ్లీ సెగ్మెంట్‌లోనూ గట్టి ఎదురు దెబ్బ తగిలింది. నీలం మధుతో పాటు, బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిది కూడా పటాన్‌చెరు నియోజకవర్గమే. కానీ ఈ ఇద్దరు అభ్యర్థుల కంటే ఇక్కడ కమలం పార్టీకి ఎక్కువ ఓట్లు పడ్డాయి. అర్బన్ ఏరియాల్లో బీజేపీ గాలి వీచింది. అందులో భాగంగానే పటాన్‌చెరులో కూడా కమలం పార్టీ ఆధిక్యాన్ని సాధించిందనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది. కానీ ఇక్కడ కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల కంటే సుమారు నాలుగు వేల ఓట్లు తగ్గాయి. అయితే నర్సాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో మాత్రం కాంగ్రెస్‌కు మంచి మెజారిటీ లభించగా, ఇటు సంగారెడ్డిలోనూ స్వల్ప ఆధిక్యత వచ్చింది.

స్థానిక నాయకత్వం తీరు..

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కొన్ని సెగ్మెంట్లలో స్థానిక నాయకత్వం ఎంపీ అభ్యర్థి నీలం మధుకు పూర్తి స్థాయిలో సహకరించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆయా సెగ్మెంట్లలో నీలంకు సంబంధించిన ఇన్‌చార్జిలను కొన్ని సెగ్మెంట్లలో కనీసం పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందనే వాదన వినిపిస్తోంది. ఎన్నికల సందర్భంగా కొన్ని సెగ్మెంట్లలో పార్టీలో చేరికలను సైతం అక్కడి లోకల్ నాయకత్వం వ్యతిరేకించినట్లు అప్పట్లో కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరిగింది. మరోవైపు ఆయా నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలుగా ఉన్న నేతలు, ముఖ్యనేతలు అభ్యర్థి గెలుపు కోసం ఏ మేరకు పనిచేశారనే దానిపై కూడా పార్టీ అధినాయకత్వం ఆరా తీసింది.

నివేదికలు..

కాంగ్రెస్ ఓటమికి గల కారణాలపై ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వం నివేదికలు తెప్పించుకుంటోంది. ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎవరు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేశారు.. ఎవరు సైలెంట్ అయ్యారు.. అనే దానిపై రాష్ట్ర నాయకత్వానికి నివేదిక అందినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇంటెలిజెన్స్ విభాగం కూడా అభ్యర్థుల గెలుపు ఓటములకు గల కారణాలను విశ్లేషిస్తూ నివేదికలు ఇచ్చినట్లు తెలుస్తోంది. మొత్తం మీద కాంగ్రెస్ గెలుపు అవకాశాలు మెండుగా ఉన్న మెదక్ చేజారి పోవడానికి గల కారణాలను పార్టీ విశ్లేషిస్తోంది.

ఓడినా.. ప్రజల మధ్యలోనే

మాజీ ఎంపీ బీబీపాటిల్

జహీరాబాద్ టౌన్: ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రజా తీర్పును స్వీకరిస్తూ.. ఓడినా నిత్యం ప్రజల మధ్యలోనే ఉంటూ సేవ చేస్తానని మాజీ ఎంపీ, జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ తెలిపారు. జహీరాబాద్ కన్వీనర్ నౌబాద్ జగన్నాథ్ అధ్యక్షతన పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014, 2019 ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించారన్నారు. మొన్నటి ఎన్నికల్లో తక్కువ మెజార్టీతో ఓడిపోయామని చెప్పారు. కాంగ్రెస్ గెలిచినా నైతికంగా గెలుపు తనదేనన్నారు. అయితే బీజేపీ ఓటు బ్యాంక్ మాత్రం గణనీయంగా పెరిగిందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో 13 శాతం ఉన్న ఓటు.. లోక్‌సభ ఎన్నికల్లో 39 శాతానికి పెరిగిందని చెప్పారు. అన్ని విధాలా అండగా ఉన్న నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గెలిచిన సురేశ్ షెట్కార్‌కు అభినందనలు తెలిపారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

సన్మానం



సురేష్ షెట్కార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తన సోదరుడు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డితో కలిసి ఎంపీని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని షెట్కార్‌ను కోరారు.

అదనపు చార్జీలు వసూలు చేయొద్దు

జిల్లా ఈ-డీఎం సందీప్

మెదక్ కలెక్టరేట్: ఆధార్ కేంద్రాల్లో అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఈ-డిస్ట్రిక్ మేనేజర్ సందీప్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలోని మీ సేవ, ఆధార్ కేంద్రాలు, ఓఎస్ఎస్ (వన్‌స్టాప్ సర్వీస్), సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్) నిర్వాహకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర కమిషనర్ ఆదేశాలు, కలెక్టర్ సూచనతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైన అదనపు చార్జీలు వసూలు చేస్తే తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని కేంద్రాల్లో తప్పనిసరిగా సిటిజన్ చార్టర్లు, అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే టీఎస్ స్థానంలో టీజీ రశీదులు అందించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్

అన్నిరకాల రిజిస్టర్లను సరైన పద్ధతిలో నమోదు చేసి, ఉన్నతాధికారులు తనిఖీకి వచ్చినప్పుడు చూపించాలని ఆదేశించారు. అదనపు రాబడి కోసం కేంద్ర సర్వీసులను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో టీజీటీఎస్‌డీఎం శశికాంత్, సీఎస్‌సీడీఎం రాజు, మీసేవ, ఆధార్, సీఎస్‌సీ, ఎస్ఎస్ నిర్వాహకులు పాల్గొన్నారు.

దత్తగిరిలో శనీశ్వర జయంతి

ఝరాసంగం(జహీరాబాద్): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో గురువారం శనీశ్వర జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వర స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేక అర్చన, 1008 కలశాలతో తిల తైల ఘటాభిషేకం, యజ్ఞం జయాది పూర్ణాహుతి, మహా మంగళహారతి, మంత్రపుష్పం తదితర పూజలు చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ మంత్రి జె.గీతారెడ్డి, హన్మంత్ రావు పాటిల్, శంకర్ పాటిల్, రఘు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆపరేషన్ ముస్కాన్'

డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో బాల కార్మికుల నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా నేటి నుంచి జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారిణి బ్రహ్మాజీ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. బాల కార్మిక వ్యవస్థను అరికట్టేందుకు ప్రతి ఏడాది జనవరి, జూలైలో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసారి జూన్‌లోనే నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు చెప్పారు. దీంతో పలుశాఖల అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి యాక్షన్‌ప్లాన్ రూపొందించామన్నారు. ఇటుక బట్టీలు, హోటళ్లు, కిరాణ షాపులు, రైస్ మిల్లులు, మెకానిక్ షెడ్డుల్లో 14 ఏళ్లలోపు పనిచేసే పిల్లలను గుర్తించి బడిలో చేరిపిస్తామన్నారు. అలాగే జూలైలో ఆపరేషన్ స్మైల్ ప్రారంభిస్తామని వెల్లడించారు. బాల కార్మికులు ఎక్కడైనా పనిచేస్తున్నట్లు తెలిస్తే 1098, 181కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



అడ్మిషన్ల పేరుతో వ్యాపారం: సీపీఎం

నర్సాపూర్: అడ్మిషన్ల పేరుతో వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేసి పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు కేటాయించాలని కోరారు. పాఠశాలలు తెరువకముందే పలు పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల పేరుతో వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. పాఠశాలల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేవని, టాయిలెట్లు లేక బాలికలు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాంలు సకాలంలో అందించండి



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వ బడులు తెరిచే లోపు విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఫరీద్‌పూర్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల పునః ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులందరికీ ఏకరూప దుస్తులు అందించాలని అధికారులను ఆదేశించారు. మహిళ సాధికారత కోసమే కుట్టు పనిని మహిళా సంఘాలకు అప్పగించామన్నారు. దుస్తుల కుట్టు పనిలో నాణ్యతా ప్రమాణాల పాటించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

మెదక్ కలెక్టరేట్: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం సీఎస్ శాంతి కుమారి గ్రూప్– 1 ప్రిలిమ్స్ నిర్వహణ, వానాకాలం సీజన్‌లో విత్తనాలు, ఎరువుల లభ్యత, మిషన్ భగీరథ, స్కూల్ యూనిఫాంలపై హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో గ్రూప్–1 ప్రిలిమ్స్ కోసం పటిష్ట ఏర్పాట్లు చేయాలని, వానాకాలం పంటకు సమృద్ధిగా ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని, మిషన్ భగీరథ నీరు గడపగడపకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో యూనిఫాంలు విద్యార్థులకు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌ఓ పద్మశ్రీ, అదనపు ఎస్పీ మహేందర్, డీఆర్డీఏ శ్రీనివాసరావు, డీఈఓ రాధాకిషన్, డీపీఓ యాదయ్య, ఏడీఏ గోవింద్, ఏఓ యూనస్, మెప్మా పీడీ ఇందిరా, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ హుస్సేన్, ఇతర జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నోటా.. తగ్గిన వాటా

నోటాకు ఓట్లు తగ్గాయి. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. ఈ ఉద్దేశంతోనే ఓటింగ్ శాతం పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నోటాకు ఓటు వేసే అవకాశం కల్పించింది. ఎన్నికల బరిలోవున్న అభ్యర్థులెవరూ నచ్చకపోతే నోటాకు ఓటు వేస్తున్నారు. 2019 లోక్‌సభ, 2023 అసెంబ్లీ, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో నోటాకు ఓటు వేసే వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. – సాక్షి, సిద్దిపేట

ఓట్ల సంఖ్య తగ్గుతోంది

- 2013 అసెంబ్లీ ఎన్నికల్లో 11,121 ఓట్లు
- ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో 4,617 మాత్రమే..
- తొలిసారిగా 2014 నుంచి అమల్లోకి..
- 37 మంది ఇండిపెండెంట్లకు నోటా కంటే తక్కువే..

దేశవ్యాప్తంగా 2014లో జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా నోటాను బ్యాలెట్ షీట్ (ఈవీఎం)లో చేర్చారు. 2013లో సుప్రీం కోర్టు తీర్పు అనుసరించి ఓటింగ్‌కు దూరంగా ఉన్న వారిని పోలింగ్ కేంద్రాల వైపు నడిపించి పోలింగ్ శాతం పెంచేందుకు నోటాను కేంద్ర ఎన్నికల సంఘం తీసుకువచ్చింది. పోటీలో ఉన్న వారు ఎవరూ నచ్చకపోతే నోటాకు ఓటు వేసే అవకాశం కల్పించారు.

తగ్గిన ఆదరణ

నోటాకు ఆదరణ మొదట్లో పెరిగినప్పటికీ ఇటీవల జరిగిన మూడు ఎన్నికల్లో క్రమ క్రమంగా తగ్గుతూ వస్తోంది. 2019లో జరిగిన ఎంపీ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో 15,383 మంది ఓటర్లు నోటాకు ఓటు వేశారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 11,121, ఇటీవల జరిగిన ఎన్నికల్లో 4,617 మంది నోటాకు ఓటు వేశారు.



నోటాకు వచ్చిన ఓట్ల వివరాలు..

అసెంబ్లీ	2024 లోక్‌సభ	2023 అసెంబ్లీ	2019 లోక్‌సభ
మెదక్	452	1,860	2,171
సిద్దిపేట	648	1,300	2,316
దుబ్బాక	590	2,269	2,268
నర్సాపూర్	397	1,386	1,844
పటాన్‌చెరు	1,316	2,663	2,658
సంగారెడ్డి	451	811	1,330
గజ్వేల్	728	832	2,796

నోటా కంటే తక్కువ ఓట్లు ..

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లను పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు పొందారు. మెదక్ లోక్‌సభ నుంచి 44 మంది పోటీ చేయగా అందులో 37 మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లను సాధించారు.

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి

బడిబాటలో డీఈఓ రాధాకిషన్

శివ్వంపేట(నర్సాపూర్)/కొల్చారం: తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని డీఈఓ రాధాకిషన్ సూచించారు. గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్నగొట్టిముక్కలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లు నిండిన బాల బాలికలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మెరుగైన వసతులతో పాటు అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. ఇంగ్లిష్ మీడియం సైతం అందుబాటులో ఉందన్నారు. ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్న విషయం గుర్తుచేశారు. ఉపాధ్యాయులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చానాయక్, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఇందుమతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొల్చారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం పిల్లలు ఎక్కువగా సాంకేతికపరమైన టెక్నాలజీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ఈ రకమైన విద్యను ఉపాధ్యాయులు సైతం పెంపొందించుకొని తరగతి గదిలో సందర్భానికి అనుగుణంగా ఉపయోగిస్తే పిల్లలు విద్య వైపు మరింత మక్కువ చూపే అవకాశాలు ఉంటాయన్నారు. సమావేశంలో మండల విద్యాధికారి నీలకంఠ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏఎంఓ సుదర్శనమూర్తి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శివ్వంపేట: బడిబాట ర్యాలీలో డీఈఓ రాధాకిషన్, విద్యార్థులు

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తునికి వ్యవసాయ పాలిటెక్నిక్‌ కళాశాలలో ప్రవేశాలు

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని తునికి వద్ద గల డాక్టర్‌ డి.రామానాయుడు విజ్ఞాన జ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యా సంస్థ వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ పాలిటెక్నిక్‌, ఇంజనీరింగ్‌ సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డైరెక్టర్‌ అర్జున రావు గురువారం తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులై, వ్యవసాయ పాలిటెక్నిక్‌ ఎంట్రెన్స్‌లో అర్హత పొందిన విద్యార్థులు దరఖాస్తులు చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. ఇక్కడ రెండేళ్ల వ్యవసాయ పాలిటెక్నిక్‌లో 120 సీట్లు, మూడేళ్ల వ్యవసాయ ఇంజనీరింగ్‌లో 30 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 26 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం వ్యవసాయ యూనివర్సిటీ ద్వారా ఎంట్రెన్స్‌లో మెరిట్‌ ఆధారంగా సీట్లు కేటాయిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యువతి అదృశ్యం


రుక్సాన

టేక్మాల్‌(మెదక్‌): యువతి అదృశ్యమైన ఘటన టేక్మాల్‌ మండలంలోని సూరంపల్లి గ్రామంలో గురువారం వెలుగు చూసింది. స్థానిక ఎస్‌ఐ మురళీ కథనం మేరకు.. సూరంపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్‌ రజియా–హైమద్‌ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు ఇద్దరూ హైదరాబాద్‌లో పని చేస్తూ నివాసం ఉంటారు. రజియా దంపతులతోపాటు చిన్న కుమార్తె రుక్సాన (25) ఇంటి వద్దే ఉంటుంది. బంధువుల పెళ్లి ఉండడంతో తల్లి రజియా 2వ తేదీన హైదరాబాద్‌కు వెళ్లింది. ఇంటి వద్దనే ఉన్న రుక్సాన వాళ్ల నాన్న హైమద్‌కు చెప్పి హైదరాబాద్‌లో డిన్నర్‌కు వెళ్తానని 4వ తేదీన ఇంటి నుంచి వెళ్లింది. అలా వెళ్లిన రుక్సాన బంధువుల వద్దకు వెళ్లలేదు. కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తల్లి రజియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహంతో ఆందోళన


ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

మద్దూరు(హుస్నాబాద్‌): మృతదేహంతో ఇంటి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేసిన ఘటన మండలంలోని మర్మాముల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ షేక్‌ యూనూస్‌ అహ్మద్‌ అలీ, గ్రామస్తుల కథనం మేరకు.. మర్మాముల గ్రామానికి చెందిన ఉప్పల పెద్ద కిష్టయ్య (70) అనే రైతుకు అదే గ్రామానికి చెందిన సుందరగిరి రాములు అనే రైతుకు మధ్య నాలుగేళ్లుగా భూతగాద నడుస్తోంది. మన బోరు మోటార్‌ను రైతు రాములు, కుటుంబ సభ్యులు గురువారం ఉదయం ధ్వంసం చేసినట్లు అల్లుడు రమేశ్‌ మామ కిష్టయ్యకు చెప్పాడు. కిష్టయ్య బావి వద్దకు వెళ్లి బోరు మోటార్‌ను చూసి బాధతో కుంగిపోయి పక్కనే ఉన్న రాయిపై పడడంతో తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. కిష్టయ్య మృతికి రాములు కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధులు అతడి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. మృతుడి అల్లుడు రమేశ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్‌): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాసాయిపేట మండలంలోని శ్రీనివాస్‌ నగర్‌ రైల్వే స్టేషన్‌ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ తావూనాయక్‌ కథనం మేరకు.. గురువారం గుర్తు తెలియని వ్యక్తి గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించగా మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, బంధువులు ఎవరైనా ఉంటే కామారెడ్డి పోలీసులను సంప్రదించాలని తావూనాయక్‌ తెలిపారు.

మందుబాబులకు జైలు, జరిమానా

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. సిద్దిపేట ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. పట్టణంలోని నర్సాపూర్‌ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తాతోపాటు పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల కిందట వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 21 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గురువారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి శ్రావణి 21 మందికి రూ.10,500 జరిమానా, వీరిలో ఒకరికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

నల్ల రేగడిలో పత్తి జోరు

వేగంగా విత్తనాల ప్రక్రియ

- తక్కువ వర్షం కురిసినా బెట్టను తట్టుకునే అవకాశం
- జిల్లాలో సాగు అంచనా 1.80 లక్షల ఎకరాలు
- ఇప్పటికే 25 శాతం మేర పూర్తి
- అంతా నల్లరేగడి భూముల్లోనే..
- అంచనాలను మించిపోయేలా సాగు

జిల్లాలోని నల్ల రేగడి భూముల్లో పత్తి విత్తన ప్రక్రియ జోరందుకుంది. నిజానికి ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి భారీ వర్షం కురవకపోయినా నల్ల రేగడి భూములు బెట్టను తట్టుకునే అవకాశం ఉంది. ఈ భూముల్లో మొదటగా పత్తిని ముందుగానే విత్తుకుంటున్నారు. సహజంగా ఏటా ఇదే జరుగుతుండగా, ఈసారి ఈ పరిస్థితి మరింతగా ఊపందుకుంది. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి 1.80 లక్ష ఎకరాల్లో పత్తి సాగులోకి వచ్చే అవకాశముందని వ్యవసాయశాఖ అంచనా వేస్తుండగా, అంచనాలకు మించి సాగు అయ్యేలా కనిపిస్తుంది. – గజ్వేల్‌


గజ్వేల్‌ మండలం ప్రజ్ఞాపూర్‌–రిమ్మనగూడ గ్రామాల మధ్యన నల్ల రేగడి భూముల్లో పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు

జిల్లాలో ఈసారి 5.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తుంది. ఇందులో భాగంగానే ప్రధాన పంటలైన వరి 3 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 60వేల ఎకరాల్లో, కంది 10 వేల ఎకరాల్లో సాగులోకి వస్తుందని చెబుతున్నారు. పత్తి మాత్రం 1.80 లక్షల ఎకరాల్లో సాగవుతుందని భావిస్తున్నారు. గతేడాది 1.08 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగులోకి వచ్చిన ఈ పంట గణనీయంగా పెరిగే అవకాశముందని వ్యవసాయశాఖ చెబుతోంది. ఈ క్రమంలో ఇప్పటికే సుమారుగా 25 శాతానికిపైగా అంటే 45 వేల ఎకరాల్లో పత్తి సాగులోకి వచ్చిందని సమాచారం. అది కూడా కేవలం నల్ల రేగడి భూముల్లో మాత్రమే. జిల్లాలో ఇంకా విస్తారంగా వానలు కురవలేదు. వర్షాలు కాస్తా ఆలస్యమైనా నల్ల రేగడి భూములు బెట్టను తట్టుకునే అవకాశం ఉండడంతో ఈ భూముల్లోనే జోరుగా పత్తి విత్తన ప్రక్రియ సాగుతోంది.

మద్దతు ధర మరింతగా పెరగొచ్చని..

జిల్లా రైతులకు ఏళ్ల తరబడి రైతులకు పత్తి సాగుతో విడదీయరాని అనుబంధం ఏర్పడింది. కాలం కలిసొస్తే స్వల్పకాలంలో రైతులను స్థితిమంతులను చేయడమో, లేదా భారీ నష్టాలు చూపి కుంగదీయడమో ఈ పంట ప్రత్యేకత. కొన్నేళ్ల కిందట వరకు ఈ పంటకు రైతులు మొదటి ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ కొన్నేళ్లుగా పత్తి సాగు రెండో స్థానంలోకి పడిపోయింది. వరి సాగు గణనీయంగా పెరగటమే ఇందుకు కారణం. గతేడాదితో పోలిస్తే ఈసారి పత్తి గణనీయంగా పెరగనుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం గతేడాది పత్తికి మద్దతు ధర రూ.6,620 నుంచి 7,020 పెంచింది. ఇందులో మీడియమ్‌ స్టేపుల్‌కు రూ.6,620, లాంగ్‌ స్టేపుల్‌కు రూ.7,020 ధరగా నిర్ణయించిన సంగతి తెల్సిందే. ఈసారి ఈ మద్దతు ధర మరింతగా పెరగొచ్చనే ఆశతో రైతులు పత్తి వైపు మొగ్గు చూపుతున్నారు.

పరిస్థితులను తట్టుకునే విత్తనాలు..

మరోవైపు అనావృష్టి ఏర్పడే సందర్భంలో బెట్ట పరిస్థితులను తట్టుకునే విత్తన రకాలు పత్తిలో ఎక్కువగా అందుబాటులోకి రావడంతో రైతులు ఈ పంట వైపు మొగ్గు చూపుతున్నారు. పత్తిని సాగు చేస్తే పెట్టుబడులు పోనూ ఎంతో కొంత మిగులుబాటు ఉంటుందని భావన రైతుల్లో వ్యక్తమవుతోంది. మరో వైపు గడిచిన యాసంగి సీజన్‌లో వరి సాగుకు విద్యుత్‌ కోతలతోపాటు సాగునీటి సమస్యలతో ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తడం, ఎకరాల కొద్దీ ఎండిపోయి గ్రాసం కోసం వదిలిపెట్టిన సంఘటనలు చోటు చేసుకోవడం రైతులను కలవరానికి గురి చేసింది. ఈ పరిస్థితి కారణంగా పత్తి వైపు రైతుల చూపు మళ్లడంతో కొన్నేళ్లుగా రెండో స్థానానికి పడిపోయిన పత్తి మొదటి స్థానానికి ఎగబాకనుంది. చివరి వరకు మొదటి స్థానంలో నిలుస్తుందో లేదో వేచి చూడాల్సి ఉన్నది.

విత్తనాలు, ఎరువుల ఇబ్బంది ఉండదు

రైతులకు ఈ సీజన్‌లో విత్తనాలు, ఎరువులకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. గతంతో పోలిస్తే పత్తి సాగు పెరిగే అవకాశం కనిపిస్తుంది. నల్లరేగడి భూముల్లో సాగు శాతం గణనీయంగా పెరుగుతోంది. ఎలాంటి పరిస్థితుల్లో నైనా భూమి తట్టుకుంటుంది.
– మహేశ్‌, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి

వాస్తు దోషమేనా?

- నిరుపయోగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం
- గతంలో ఇక్కడున్న ఇద్దరు ఎమ్మెల్యేలు ఓటమి
- ప్రస్తుత మంత్రి దామోదర రాకపోవడంతో అందోల్‌లో జోరుగా చర్చ
- భవనానికి ఎదురుగా శ్మశానవాటిక


అందోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

జోగిపేట(అందోల్‌): రాష్ట్ర వ్యాప్తంగా గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.కోటితో అన్ని సౌకర్యాలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను నిర్మించింది. అందోలు నియోజకవర్గానికి సంబంధించి అందోలు–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోనూ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయగా అప్పటి ఎమ్మెల్యే బాబూమోహన్‌ 2017లో ప్రారంభించారు. ఈ తర్వాత 2018లో ఎమ్మెల్యేగా ఎన్నికైన చంటి క్రాంతికిరణ్‌ ఐదేళ్లపాటు అక్కడి నుంచే కార్యకలాపాలను కొనసాగించారు. 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో క్రాంతికిరణ్‌ ఓటమి చెంది కాంగ్రెస్‌ పార్టీకి చెందిన దామోదర రాజనర్సింహ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. డిసెంబర్‌లో జరిగిన మంత్రి వర్గ విస్తరణలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రిగా దామోదర రాజనర్సింహకు అవకాశం లభించింది. ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటి వరకు క్యాంపు కార్యాలయంలో దామోదర కాలు పెట్టలేదు. మంత్రి కావడంతో సంగారెడ్డిలో తన ఇంటి నుంచే కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు.

వాస్తుదోషమే అని జోరుగా చర్చ?

క్యాంపు కార్యాలయం వాస్తుకు విరుద్ధంగా ఉందని అందుకే కార్యాలయాన్ని వాడడం లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఉదయం లేవగానే ఎదురుగా శ్మశానవాటికల వైపు చూడాల్సి వస్తుందని కొందరు చెబుతున్నారు. క్యాంపు కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే బాబూమోహన్‌కు 2018లో బీఆర్‌ఎస్‌ టికెట్‌ను కేటాయించలేదు. 2023లో క్రాంతికిరణ్‌ ఓటమి చెందడం, ఇలా క్యాంపు కార్యాలయంలో కార్యకలాపాలు నడిపిన ఇద్దరు నాయకులు ఓటమి చెందడంతో వాస్తు దోషం వల్లనే ఇలా జరిగిందని చెప్పుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు

క్యాంపు కారాయలంలోకి మంత్రి దామోదర రాజనర్సింహ రాకపోవడంతో కార్యాలయ నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. క్యాంపు కార్యాలయ గేట్‌కు కనీసం తాళం వేయకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. ఎన్నికలు జరిగిన కొద్ది రోజులకే క్యాంపు కార్యాలయం తాళాలు పగులగొట్టి అందులోని ఫ్యాన్లు, ట్యూబ్‌ లైట్లు, ఫర్నిచర్‌ ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఆర్‌అండ్‌బీ అధికారుల ఆదేశాలు, సూచనల మేరకు తాము తాళాలను అప్పగిస్తామని, ప్రస్తుతం తాళాలు మా వద్దనే ఉన్నట్లు తహసీల్దార్‌ భాస్కర్‌ కుమార్‌ 'సాక్షి'కి తెలిపారు.

నిషేధిత టొబాకో స్వాధీనం

రూ. 4,15,450 విలువ


టొబాకో ప్యాకెట్లను చూపుతున్న సీఐ ఉపేందర్‌

సిద్దిపేటకమాన్‌: ప్రభుత్వ నిషేధిత టొబాకోను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. సిద్దిపేట వన్‌ టౌన్‌ సీఐ లక్ష్మీబాబు, టూటౌన్‌ సీఐ ఉపేందర్‌ కథనం మేరకు.. సిద్దిపేట పట్టణం సుభాష్‌రోడ్‌లోని గుండ శ్రీనివాస్‌ నిర్వహిస్తున్న హరిహర హోల్‌సేల్‌ కిరాణ దుకాణంలో, కరీంనగర్‌ రోడ్డు సంజీవయ్య నగర్‌లో చీకోటి శ్రీనివాస్‌ నిర్వహిస్తున్న సీఎస్‌ఆర్‌ ఎంటర్‌ప్రైజెస్‌ షాపులో ప్రభుత్వ నిషేధిత టొబాకో విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది. టాస్క్‌ఫోర్స్‌, వన్‌ టౌన్‌, టూటౌన్‌ పోలీసులు తమ సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీలు నిర్వహించగా రెండు దుకాణాల్లో రూ.4,15,450 విలువ గల టొబాకో ప్యాకెట్ల లభ్యమయ్యాయి. వెంటనే వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్లాట్‌ కాజేయాలని హత్యాయత్నం

- నిందితుల అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ సంజీవరావు


వివరాలు వెల్లడిస్తున్న సంజీవరావు

పటాన్‌చెరుటౌన్‌: ప్లాట్‌ను కాజేయాలనే ఉద్దేశ్యంతో హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌ రెడ్డి, సీఐ ప్రవీణ్‌ రెడ్డిలతో కలిసి జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జిన్నారం మండలం మంత్రికుంట గ్రామస్తురాలైన పోచమ్మ పటాన్‌చెరు మండలంలో ఇంద్రేశం కాలనీలో 200 గజాల ప్లాట్‌ కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేపట్టింది. ఆ ప్లాట్‌ లిటిగేషన్‌లో ఉండటంతో రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం చేసే నర్సాపూర్‌ చెందిన తిమ్మారెడ్డిగారి విభూషణ్‌ రెడ్డి, రాళ్లకత్వ గ్రామానికి చెందిన రొయ్యపల్లి గోపాల్‌ ఇద్దరూ కలిసి కబ్జా చేయాలనుకున్నారు. ప్లాటుకు సంబంధించి రెండు లే అవుట్లు ఉండటంతో నాగధర లక్ష్మణ్‌ అనే వ్యక్తి వద్ద వీరిద్దరు కొనుగోలు చేసి జాయింట్‌ రిజిస్ట్రేషన్‌ చేయించుకున్నారు. ప్రస్తుతం ఆ ప్లాట్‌ పొజిషన్‌లో ఉన్న పోచమ్మను, ఆమె కొడుకును చంపేసి ప్లాటును స్వాధీనం చేసుకోవాలని పథకం వేశారు. వీరిని చంపడానికి అల్వాల్‌కు చెందిన రౌడీషీటర్‌ కరణ్‌ సింగ్‌తో రూ.40 వేలకు మే 31 కిరాయి మాట్లాడుకున్నారు. కరణ్‌ సింగ్‌, ప్రతాప్‌ సింగ్‌, కొంతమంది కిరాయి రౌడీలతో కలిసి విభూషణ్‌ రెడ్డి, గోపాల్‌లు ప్లాటు వద్దకు వెళ్లి పోచమ్మ, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేశారు. దీంతో పోచమ్మ పటాచెరు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో భాగంగా పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ పరిధిలో గురువారం పోలీసులు విభూషణ్‌ రెడ్డి, కరణ్‌ సింగ్‌, ప్రతాప్‌ సింగ్‌ ను అరెస్ట్‌ చేసి రిమాండ్‌ కు తరలించారు. పరారీలో ఉన్న మరో ఏడుగురిని త్వరలో పట్టుకుంటామన్నారు.

అథ్లెటిక్స్‌లో సిద్దిపేటకు పతకం


మెడల్‌ అందుకుంటున్న జితేష్‌

సిద్దిపేటజోన్‌: హన్మకొండలో జరిగిన 10వ తెలంగాణ రాష్ట్ర సబ్‌ జూనియర్‌ అథ్లెటిక్స్‌ చాంపియన్స్‌లో సిద్దిపేటకు పతకం లభించింది. సిద్దిపేటకు చెందిన జితేష్‌ 300 మీటర్లను 48 నిమిషాల్లో పూర్తి చేసి కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్‌ సెక్రటరీ సారంగపాణి చేతుల మీద మెడల్‌, సర్టిఫికెట్‌ అందుకున్నాడు. మెడల్‌ సాధించడంపై జిల్లా అసోసియేషన్‌ అధ్యక్షుడు పరమేశ్వర్‌ సెక్రటరీ వెంకట్‌ స్వామి విద్యార్థిని అభినందించారు.

ఎద్దుల దొంగతనం

వట్‌పల్లి(అందోల్‌): అందోలు మండలం సంగుపేట గ్రామంలో గుర్తు తెలియని దొంగలు వ్యవసాయ బావి వద్ద ఉన్న ఎద్దులను ఎత్తుకెళ్లారు. జోగిపేట పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఈషామొద్దీన్‌కు చెందిన రూ.1.30 లక్షల విలువ చేసే రెండు ఎద్దులు, బంటు అనంతయ్యకు చెందిన రూ.54 వేల విలువ చేసే ఎద్దును పొలం వద్ద కట్టేశారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఎద్దులను వాహనంలో తీసుకెళ్లారు. గురువారం ఉదయం చూసేసరికి ఎద్దులు లేకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చుట్టుప్రక్క గ్రామాల్లో వెతికినా ఎక్కడా ఆచూకీ లభించలేదని, నిందితులను పట్టుకొని న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి


శంకర్‌ (ఫైల్‌)

కౌడిపల్లి(నర్సాపూర్‌): బైక్‌పై నుంచి కింద పడటంతో వ్యక్తి మృతి చెందిన ఘటన కౌడిపల్లి మండలం ధర్మాసాగర్‌ చెరువు కట్టపై గురువారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన తాటి శంకర్‌(42) భార్యా పిల్లలతో కలిసి ఐదేళ్ల కిందట బతుకు దెరువు కోసం హైదరాబాద్‌ వలస వెళ్లాడు. అక్కడ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పక్షం రోజుల కిందట గ్రామంలో అతడి చిన్నాన్న మృతి చెందడంతో శంకర్‌ కుటుంబ సభ్యులతో వచ్చాడు. గురువారం ఉదయం పని ఉందని బైక్‌పై కౌడిపల్లికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ధర్మాసాగర్‌ చెరువు కట్టపై బైక్‌పై నుంచి కింద పడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన వాహనదారులు నర్సాపూర్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడు..

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): నీటి గుంతలో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పెద్దాపూర్‌ గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్‌ గౌడ్‌ కథనం మేరకు.. సదాశివపేట పట్టణంలోని చాకలికేరికి చెందిన గార్లపల్లి ప్రవీణ్‌ కుమార్‌(25) ఎంఎస్‌ఎన్‌ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో పెద్దాపూర్‌ గ్రామ శివారులోని ఓ నర్సరీలో ఉన్న నీటి గుంతలో ఈత కొట్టడానికి వెళ్లాడు. ఈత కొట్టే సమయంలో ప్రమాదవశాత్తు నీటి గుంతలో మునిగి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల్లి సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ఉద్యమాలు

దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య


మాట్లాడుతున్న అడివయ్య

నారాయణఖేడ్‌: దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య తెలిపారు. నారాయణఖేడ్‌ అంబేడ్కర్‌ భవన్‌లో గురువారం సంఘం డివిజన్‌ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 40 లక్షల మంది దివ్యాంగులు ఉంటే కేవలం 5.75 లక్షల మందికే పింఛన్లు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్‌ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ నెల 27న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి దివ్యాంగుల సాంస్కృతిక ఉత్సవాలను, జూలై 23, 24 తేదీల్లో నారాయణఖేడ్‌లో జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్‌ పాటిల్‌, ఖేడ్‌ డివిజన్‌ అధ్యక్షుడు ఇస్మాయిల్‌, జిల్లా, డివిజన్‌ నాయకులు ప్రకాశ్‌ రావు, శంకర్‌ నాయక్‌, తుకారాం, సురేశ్‌, రాములు, అనిత, లక్ష్మయ్య, సామేల్‌, సంతోష్‌, వీరయ్య, నాగన్న, మల్లప్ప పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై..


సంగమేశ్వర్‌ (ఫైల్‌)

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): ఐదు రోజుల కిందట అదృశ్యమైన ఓ వ్యక్తి మండల పరిధిలోని కోనాపూర్‌ శివారులోని గంగకత్వ వాగులో శవమై తేలాడు. ఈ ఘటన సదాశివపేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్‌ గౌడ్‌ కథనం మేరకు.. మూసాపేట్‌ హైదరాబాద్‌కి చెందిన దోసాడ సంగమేశ్వర్‌ (37) మునిపల్లి మండల పరిధిలోని కంకోల్‌ గ్రామ శివారులో ఓక్సన్‌ యూనివర్సిటీలో తోట మాలిగా పని చేస్తున్నాడు. ఈ నెల 2న యూనివర్సిటీలోకి పనికి వెళ్లిన సంగమేశ్వర్‌ అదృశ్యమయ్యాడు. చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం సదాశివపేట మండల పరిధిలోని కోనాపూర్‌ శివారులోని అలేఖ్య వెంచర్‌ పక్కన గంగకత్వ వాగులో అనుమానాస్పదంగా మృతదేహమై కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం


మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

కొండాపూర్‌(సంగారెడ్డి): పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ రత్నప్రసాద్‌ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని కళాశాలలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం రత్నప్రసాద్‌ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కనీసం ఏడాది ఒక మొక్క అయినా నాటి దానిని పరిరక్షించడం వృత్తిగా పెట్టుకోవాలన్నారు. చెట్లు పర్యావరణ పరిరక్షణలో ప్రధాన పాత్రను పోషిస్తాయని, ప్రపంచంలో ఆధునికీకరణ, నగరీకరణ పేరుతో మానవుడు అడవులను నరికి వేయడం ఆందోళనకరమన్నారు. ఈ కార్యక్రమానికి కావాల్సిన మొక్కలను హైదరాబాద్‌ కేంద్రంగా పనిచేస్తున్న విత్‌ యూ ఫౌండేషన్‌ సమకూర్చిందని, తాము ఫౌండేషన్‌ సహకారంతో ప్రతి నెలా కనీసం రూ.1,500 విలువ కలిగిన చెట్లను నాటుతున్నామన్నారు. కార్యక్రమములో వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వెంకటేశం, ఎన్‌ఎస్‌ఎస్‌ అధికారులు డాక్టర్‌ పద్మజ, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో మేలు..

- చీడ పురుగుల నుంచి రక్షణ
- వానాకాలం పంటలకు ఉపయోగం




దుక్కి దున్నుతున్న రైతు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు ముందుగా వేసవి దుక్కులను సిద్ధం చేస్తున్నారు. ఈ దుక్కి దున్నడం వల్ల కలిగే ఉపయోగాల గురించి జిల్లా వ్యవసాయాధికారి మహేశ్‌ మాటల్లో..

వేసవి దుక్కిలతో రైతులకు అనేక విధాలుగా ఉపయోగాలు ఉంటాయి. సాగు భూమిలో ఉండే గడ్డి విత్తనాలు నశిస్తాయి.అదే విధంగా భూమిలో ఉండే బ్యాక్టీరియా, ఫంగస్‌తోపాటుగా పంటలను నాశనం చేసే చీడ పురుగుల గుడ్లు బయటకొచ్చి అధిక ఉష్ణోగ్రతతో నశిస్తాయి. ఈ చీడ పురుగుల గుడ్లు నశించడం వల్ల సాగు చేస్తున్నప్పుడు రైతులు కీటక నిర్మూలన కోసం రసాయన మందులు వాడాల్సిన పరిస్థితి ఉండదు.

నీటిని నిలువుకునే శక్తి..

వేసవి దుక్కిలను వాలుకు అడ్డంగా దున్నాలి. ఈ విధంగా దున్నడం వల్ల వర్షపు నీరు నేరుగా భూమిలోకి వెళ్లి నీటి నిల్వలు పెరుగుతాయి. లేని పక్షంలో నీరు దుక్కి నుంచి బయటకు వెళ్తుంది. వాలుకు అడ్డంగా దుక్కిని సిద్ధం చేయకపోతే ఎరువులు వృథాగా బయటకు వెళ్తాయి. దీంతో పంటలకు నష్టం వాటిల్లుతుంది.

ఎరువులు సమ పంపిణీ..

ఈ దుక్కిలను సాగుకు ముందుగా సిద్ధం చేసుకోవడంతోపాటు పశువుల ఎరువులను రైతులు వ్యవసాయ భూమిలో వేస్తారు. దీని వల్ల పశువుల ఎరువులు వ్యవసాయ భూమిలో అంతటికి సమంగా చేరుతుంది.

కలుపు నివారణగా...

వేసవి దుక్కి దున్నడం ద్వారా భూమిలో ఉన్న కలుపు మొక్కల మూలాలు భూమి పై పొరకు వస్తాయి. వాటిని రైతులు ఒక దగ్గర వేసి మంట పెడుతారు. ఇది రైతులకు లాభిస్తుంది. అందువల్ల రైతులు ముందుగానే ఈ దుక్కిలను సిద్ధం చేసుకుంటున్నారు.